# పుట్టినిల్లు

**స్థానిక సంస్థలు భావి నాయకులకు జన్మనిచ్చే పుట్టినిల్లు. అంతే కాదు ప్రజాస్వామ్యానికి అవి ప్రయోగశాలలు అంటారు.**

**నిజమే నేటి కౌన్సిలరే రేపటి ఛైర్మన్. రేపటి ఛైర్మనే ఎల్లుండికి ఎమ్మెల్యే.**

కౌన్సిలరు అయిన తర్వాత రామాంజనేయులుకి గొప్ప తెలివొచ్చిపడిపోతోంది. డబ్బుకూడా వచ్చి పడిపోతుందంటారు. కానీ ఆ విషయం అతనంతగా పట్టించుకోడు. ఎందుకంటే అది అతని భార్య శ్రీలక్ష్మి చూసుకుంటుంది. అతనికి మాత్రం ప్రజాసేవే పరమావధి.

తను కౌన్సిలరుగా గెల్చిన వెంటనే ఏకాఏకిన తిరుపతి వెళ్ళి గుండు గీయించేశాడు. ఆతర్వాత శ్రీశైలం వెళ్ళి మొక్కు తీర్చుకున్నాడు. ఆ తర్వాత షిర్డీ వెళ్ళి నాలుగురోజులుండి వచ్చాడు. మంత్రాలయం వెళ్ళి రాఘవేంద్రస్వామి దర్శనం చేసుకుని వస్తుంటే ఒక ముసలాడు కనబడ్డాడు. మరి రాఘవేంద్రస్వామే అలా కనబడ్డాడో, వెంకన్నస్వామి దర్శనమిచ్చాడో, మల్లన్నకే దయగలిగిందో-ఏమైందో సరిగా తెలీదుకానీ, ఆ ముసలాడు తన చెయ్యి పట్టుకొని ఆపి "నాయినా నిన్ను నమ్మినవాళ్ళను అన్యాయం చెయ్యొద్దు" అని ఒకే ఒక్కమాట చెప్పి గుంపులో కల్సిపోయాడు.

నలుగురు కనిపిస్తే చాలు జరిగిన అనుభవాన్ని ఒళ్ళంతా గగుర్పాటుకు లోనయిన ఫీలింగుతో ఆ విషయం చెబుతుంటాడు రామాంజనేయులు.


ఇలాగే ఒకరోజు ఈ అనుభవం గురించి చెబుతుండగా తనతోటి ముగ్గురు కౌన్సిలర్లు వచ్చారు. వాళ్ళను సాదరంగా ఆహ్వానిస్తూ చుట్టూ కూర్చున్న వాళ్ళను బయటకి పంపించేసాడు. "ఏంటి చెప్పండి" అన్నాడు వాళ్ళనుద్దేశించి.

"ఈనెల అజెండా చూశావన్నా!" అన్నాడు వెంకట స్వామి.అతను ఎనిమిదోవార్డు కౌన్సిలరు.

"ఇంక చూళ్ళే ఏం!"

"ఏమి అన్యాయమన్నా ఇది. నా వార్డులో ఒక్క వర్కులేదు. ఇతని వార్డులో అస్సల్లేదు. పోనీ వర్కుల్లేకపోతే పోయె! ఆ కమీషనర్‌కి, ఆ ఛైర్‌పర్సనల్ టెండర్లు ఈ మీటింగులో పెట్టొద్దని చెప్పాం. మావాళ్ళకి ఒక్క టెండరు రాలేదు, వచ్చినవాళ్ళు మా దగ్గరకి వచ్చినవరకు టెండర్లు కౌన్సిల్ మీటింగుకి రాకుండా చూసుకోతల్లీ అని మొక్కిమొక్కి చెప్పినాం. ఏంజేసిందో చూడు" అని చేతిలోని అజెండా కాపీ విసిరికొట్టాడు జగదీష్.

"ఈ దపా మీటింగులో మన తడాఖా చూపించాలి. లేకపోతే మనకి వేల్యూ ఉండదు. మన పనులు జరగవు. మన కేష్టు అన్యాయమైపోతుంది" అని ఇంకా ఏదేదో శోషవచ్చి పడిపోయినంత ఆవేశంగా మాట్లాడాడు వెంకటస్వామి. కుమార్ మాత్రం ఏం మాట్లాడలేదు. ఎందుకంటే కుమార్ కొత్తగా గెల్చిన కౌన్సిలరు. అతని మొట్టమొదటి కౌన్సిల్ మీటింగు అంతా విని రామాంజనేయులు చాలా కూల్‌గా మాట్లాడాడు.



"వెంకటస్వామీ! నువు ఇండిపెండెంటువి. జగదీష్ మావాళ్ళతో పొత్తు పెట్టుకుని గెల్చినవాడు. ఇక కుమార్ జాతీయ పార్టీకి చెందినవాడు. నాది ప్రాంతీయ పార్టీ. మనందరం పార్టీలు, సింబల్స్, స్లోగన్స్, మేనిఫెస్టోలు అన్నీ మర్చిపోయి ఒక గూటిలోకి ఎందుకు చేరినాం. ఒక బాటలో ఎందుకు నడవాలనుకున్నాం. కేష్టు కోసం. మనం గెలవడానికి కారణం కేష్టు. కాబట్టి కేష్టుకి అన్యాయం జరిగినా, కేష్టుకి న్యాయం జరగకపోయినా చూస్తూ సహించేది ఎంతమాత్రం లేదు. పైగా నిన్ను నమ్మినవాళ్ళను అన్యాయం చెయ్యొద్దని సాక్షాత్తు దేవుడేచెప్పాడు" అని ఎంతో ఆవేశంతో ప్రసంగించి గ్లాసుడు మంచినీళ్ళు గటగట తాగాడు రామాంజనేయులు.

కేష్టు పట్ల రామాంజనేయులుకున్న కమిట్‌మెంటు చూసి వాళ్ళకు చాలా సంతోషం వేసింది.

"సరేనన్నా! రేపు మీటింగులో ఏంచేయాలో చెప్పు!" అన్నారు.

"మనం అడిగిన పనులు పెట్టలేదు కాబట్టి, మనం పెట్టొద్దని అడిగినా టెండర్లు పెట్టింది కాబట్టి రేపటి కౌన్సిల్ మీటింగ్ రసాభాస కావాల్సిందే" కుమార్ నువ్వు అజెండా చదవకముందే లేచి ఛైర్మన్‌గారూ! మా వార్డులో శానిటేషన్ ఏమీ బాగోలేదు. కాలువలు క్లీన్ చెయ్యట్లేదు. కసువు కుప్పలు ఎత్తట్లేదు. నాలుగు పందులు చచ్చిపోయి రోడ్డుమీద పడివున్నాయి. కుళ్ళి కంపుకొడుతున్నాయి. ఇదేంటిది! నా వార్డంటే చిన్న చూపా? లేకపోతే మా వార్డులోని వారు ప్రజలు కారా! శానిటేషన్ వారికి అవసరం లేదా" అని అడుగు.

ఛైర్మన్ వెంటనే కమీషనర్ వైపు చూస్తుంది. కమీషనర్ హెల్తాఫీసర్ వైపు, హెల్తాఫీసరు ఇన్‌స్పెక్టర్‌వైపు ఇన్‌స్పెక్టర్ మేస్త్రీ వైపు చూస్తారు.

వాళ్ళలా ఒకర్నొకరు చూసుకుని జవాబిచ్చేలోపల నువు రెచ్చిపోయి అడగాలి.

"ఏమని" అడిగాడు కుమార్.

"ఏమైనా అడగొచ్చు. శానిటేషన్ మీద నుండి టౌను ప్లానింగ్ విషయాలు

## దీర్ఘాశి విజయభాస్కర్

మాట్లాడు. తర్వాత స్కూళ్ళు ఆ తర్వాత రోడ్లు. తర్వాత కుళాయిల్లో నీరు సరిగా రావట్లేదని చెప్పు. ఆ తర్వాత బిల్‌క్లింటన్ విజిట్ గురించి, నేపాల్ రాజు గురించీ, తర్వాత "చాలాబాగుంది" సిన్మాగురించి.

"వాటితో మనకేం సంబంధం" అన్నాడు కుమార్.

"ఒరి పిచ్చోడా! కౌన్సిలో ప్రస్తావనకు కాదేది అనర్హం! ఏదైనా మాట్లాడేయొచ్చు! అన్నీ మాట్లాడేసి మీరు, మీ పార్టీ వాళ్ళు, మీ పార్టీఅధ్యక్షులు లంచగొండులు అను."

"దాంతో నేను రెచ్చి నీమీద పడతాను. మమ్మల్ని ఏమైనా అనుగానీ మాపార్టీ అధ్య క్షుడ్ని ఒక్కమాటన్నా నీ రక్తం కళ్ళజూస్తానని ఆవేశంతో ఊగిపోతాను. అది చూసి మీవాళ్ళు నామీద పడతారు. మావాళ్ళు మీవాళ్ళ మీద పడతారు. ఇలా మేము ఒక్క ర్నొకరం తోసు కుంటుండగా, ప్రజాస్వామ్యాన్ని చంపేయండి! స్వేచ్ఛని బతికించండని! అని ఆవేశంతో ఊగిపోయి అలవోకగా మైకు ఊడదీసి, గాలిలోకి విసరాలి.

"ఎటువైపు విసరాలి" కుమార్ ప్రశ్నించాడు.

ఎటు విసిరినా ఫర్వాలేదు. ఆ మైకు వెళ్ళి ఛైర్‌పర్సన్‌కు తగలాలి. దాంతో మా వాళ్ళింకా రెచ్చిపోయి నీ మీదకు వస్తారు.

"అమ్మో మీవాళ్ళు నన్ను తంతారేమో!" భయపడుతూ అడిగాడు కుమార్.

"నిజానికి తన్నాలి! కానీ వెంకటస్వామి, జగదీష్ అప్పటికే నీ చుట్టూ చేరి నువు చేసింది తప్పని నిలదీస్తుంటారు. అదే సమయంలో మావాళ్ళు నిన్ను తన్నకుండా నిలువరిస్తుంటారు. అంటే నిన్ను ఒకపక్క తిడుతూ మరోపక్క రక్షిస్తారన్న మాట. అర్థమైందా?"

ఈసారి వెంకటస్వామి, జగదీష్‌ని అడిగాడు రామాంజనేయులు. అర్థమైందన్నారు వాళ్ళు.

అలా మీరు కుమార్‌ని మీ ఇద్దరి మధ్య ఇముడ్చుకొని ఛైర్మన్ టేబిల్ దగ్గరకు తీసుకువెళ్ళండి. మా పార్టీ వాళ్ళు ఒకంతట వదలరు. నేను వాళ్ళందర్నీ దూరంగా నెడుతూ, నేను మీ దగ్గరకు వస్తాను. ఇలాగే అందరం ఛైర్మన్ టేబిల్ ముందుకొస్తాం. అప్పటికే మీ ఇద్దరూ కుమార్ చేసిన పనిని ఖండిస్తున్నట్లు, కుమార్ చేత ఛైర్‌పర్సన్‌కి క్షమాపణ చెప్పించడానికి ఒత్తిడి చేస్తున్నట్టు ఎస్టాబ్లిష్ చెయ్యాలి.

ఇలా ఈ గందరగోళంలో ఛైర్‌పర్సన్ ఉక్కిరిబిక్కిరి అవుతుంటుంది. చెమటలు పడతాయి. కాళ్ళుచేతులు ఆడవు. నోటి మాట రాదు. ఇలాంటి పరిస్థితిని చూస్కొని వెంకటస్వామి కుమార్‌ని ఆమె మీదకు నెట్టాలి.

సెంటీమీటర్ నెడితే కిలోమీటర్ దూరం నెట్టిన ఫీలింగుతో పడిపోతావ్. జగదీష్ నిన్ను ఆపబోతాడు. ఆ నెపంతో ఆమె మీద చెయ్యేసి చీరో, జాకెట్టో చింపేయాలి! ఎవరు చింపారో తెలీకూడదు.

ఆ తర్వాత కుమార్‌ని అక్కడినుండి తప్పించి ఇంటికి పంపించెయ్యండి.

"ఇదంతా తప్పుకాదా" అమాయకంగా అడిగాడు కుమార్.

"తప్పే. కానీ నేరంకాదు. నేరాలు చేసినవాళ్ళే అధికారం చెలాయిస్తున్నారు. వాళ్ళే రాజ్యాలు ఏల్తున్నారు. తప్పులు చెయ్యకుండా నేరాలు చేసేస్థాయికి ఎదగలేం. కాబట్టి ఈసారి నేను చెప్పినట్టు చేయండి. మరోసారి ఛైర్‌పర్సన్ మనం చెప్పింది చెయ్యకపోతే మీ చెప్పుతో నన్ను కొట్టండి" అని ముగించాడు రామాంజనేయులు.

గీతోపదేశం విన్న ముగ్గురు అర్జున్లూ లేచారు; ఆ ముగ్గురు కౌన్సిలర్లు. ఇదిగో ఇకముందు ఇలా ఇళ్ళ దగ్గర కల్సుకోవద్దు. వచ్చేవారం మన కులపాళ్ళం వనభోజనం ఏర్పాటుచేసుకొని అక్కడకల్సుకుందాం.

'సరేనంటూ' బయటికొచ్చారు ముగ్గురు. ●